# అభివృద్ధి జరగాలంటే నాగజ్యోతిని గెలిపించండి



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన అభ్యర్థి బడే నాగజ్యోతి, మంత్రి సత్యవతి రాథోడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

- ములుగులో వందశాతం గెలుపు బీఆర్ఎస్‌దే..
- కమలాపురం బిల్ట్ ఫ్యాక్టరీని తెరిపిస్తాం
- ఏటూరునాగారంలో బస్‌డిపో ఏర్పాటు చేస్తాం
- ముల్లకట్ట నుంచి అకినేపల్లి మల్లారం వరకు గోదావరి కరకట్ట నిర్మాణం
- ఏటూరునాగారం రోడ్ షోలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు

ములుగు, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ)/ ఏటూరునాగారం : రాష్ట్రంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేది కేసీఆర్ అని ములుగు ప్రాంతం అభివృద్ధి చెందాలంటే బడే నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన రోడ్‌షోకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ములుగు నియోజకవర్గ ప్రజలు గత ఎన్నికల్లో చేసిన తప్పు మళ్లీ చేయొద్దని, ఆనాడు అభ్యర్థి ఓడినప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం ములుగును జిల్లాగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేశామన్నారు. నియోజకవర్గ పెండింగ్ సమస్యలను నాగజ్యోతి తన దృష్టికి తీసుకొచ్చారని, ఆమెను గెలిపిస్తే వాటన్నింటినీ తప్పనిసరిగా పరిష్కరిస్తామన్నారు. మంగపేట మండలం కమలాపురంలో మూత పడిన బిల్ట్ ఫ్యాక్టరీని తెరిపించే పూచీ నాదేనని హామీ ఇచ్చారు. ఏటూరునాగారంలో తప్పకుండా బస్ డిపో ఏర్పాటు చేసి రవాణా సౌకర్యాలు మెరుగుపరుస్తామని తెలిపారు. ముల్లకట్ట నుంచి అకినేపల్లి మల్లారం వరకు గోదావరి కరకట్ట, యువత కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్ సైతం నిర్మిస్తామన్నారు. కొండాయి గ్రామానికి రోడ్డు, బ్రిడ్జి నిర్మిస్తామని, గోదావరి ముంపు ప్రాంత వాసులకు మోడల్ కాలనీలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మ్యానిఫెస్టోలో పేర్కొన్న పథకాలన్నింటినీ అమలు చేస్తామన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచి పిరమైన ప్రధానిగా చరిత్రకు ఎక్కారన్నారు. దేశానికి బువ్వ పెట్టే స్థాయికి చేరిన తెలంగాణ ఎదిగిందని, రాష్ట్రంలోని ప్రజలందరికీ రేషన్ షాపుల ద్వారా ప్రతి నెలా సన్న బియ్యం అందిస్తామన్నారు. 50 ఏండ్లు పరిపాలించిన కాంగ్రెస్ ఆసరా పింఛన్లు రూ. 200లకు పరిమితం చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం నెలకు రూ.2వేలు ఇస్తున్నదని గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే దానిని రూ.ఐదు వేలకు పెంచుతామన్నారు. జనవరిలో కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు ఇప్పించే బాధ్యత నాదే అన్నారు. పోడు భూముల సమస్యలు పరిష్కరించి ఎమ్మెల్యే సీతక్క తల్లిదండ్రులకు సైతం పట్టాలిచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం వల్లే రైతుబంధు ఆగిందని, పదకొండు సార్లు రైతు బంధు ఇచ్చినట్టే మూడో తేదీన రైతులందరికీ 12వ దఫా రైతు బంధు డబ్బులు జమ చేస్తామన్నారు. మార్పు కావాలంటున్న కాంగ్రెస్ నాయకులు ఏం మార్పు కావాలో వారికి అర్థం కావడం లేదన్నారు. వారు అధికారంలో ఉన్నప్పుడు ఆర్నెల్లో కో ముఖ్యమంత్రిని మార్చే మార్పు కావాలా అని ప్రశ్నించారు. నల్లధనాన్ని వెలికితీసి ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15లక్షలు వేస్తామని చెప్పిన మోదీ ఉప్పు, పప్పుల ధరలు పెంచి మోసం చేశాడన్నారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేసి కరాబు చేసుకోవద్దన్నారు. నాగజ్యోతిని గెలిపిస్తే సీఎం కేసీఆర్ కూడా ములుగులో రెండు రోజులు ఉండి అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. మీరు గెలిపించాల్సింది ఇన్‌స్టాగ్రామ్ ఎమ్మెల్యేను కాదని ప్రజల్లో ఉండి మీకు సేవ చేసే వారిని అని గుర్తు చేశారు.

### కాంగ్రెస్ దరిద్రాన్ని మళ్లీ తెచ్చుకుందామా ?

50 ఏండ్లు పరిపాలించిన దిక్కు మాలిన కాంగ్రెస్‌తో రాష్ట్రం అభివృద్ధి చెందకపోవడం వల్లే తెలంగాణ తెచ్చుకున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ దరిద్రాన్ని మళ్లీ నెత్తిన పెట్టుకుందామా అంటూ ప్రశ్నించారు. మూడు గంటలు కరెంటు ఇస్తే సరిపోతుందని రేవంత్‌రెడ్డి అంటున్నారని మూడు గంటలు ఇస్తే సరిపోతుందా అన్నారు. 2014కు ముందు ములుగులో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఆనాడు బస్ డిపో ఎందుకు ఏర్పాటు చేయలేక పోయారన్నారు. ఏటూరునాగారంలో ఆనాడు కరెంటు పరిస్థితి ఎలా ఉండేది.. ఇప్పుడెలా ఉండేదో మీకే తెలుసన్నారు. కాంగ్రెస్ పాలనలో పేలిపోయే మోటర్లు, కాలిపోయే స్టార్టర్లు, రాత్రి పూట కరెంటుతో రైతులు అవస్థలు పడ్డారన్నారు. పాములు కరిచి కరెంటు షాక్‌లతో ప్రాణాలు కోల్పోయారన్నారు. వ్యవసాయం గురించి తెలియక ఉత్తమ్ కుమార్‌రెడ్డి రైతు బంధు దండుగ అని, భట్టి విక్రమార్క పట్వారీ వ్యవస్థను మళ్లీ తెద్దామంటున్నాడని ధరణి తీసేసి భూమేత తెస్తామంటున్నారన్నారు. మళ్లీ ఊళ్లలో దళారులు, పట్వారీలు కావాలా అంటూ ప్రశ్నించారు. ఒక్క ఛాన్స్ ఇవ్వండి అంటున్నారని, పదకొండు చాన్సులు ఇస్తే 55 ఏండ్లు రాష్ట్రం, దేశంలో అధికారం చెలాయించి ఏం ఒరగబెట్టారని నిలదీశారు. మార్పు కావాలె కాబట్టి తెలంగాణ తెచ్చుకుని అన్ని మార్పులు చేసుకున్నామని కేటీఆర్ అన్నారు. దిక్కు మాలిన ఇందిరమ్మ రాజ్యంలో ఆకలి కేకలు, గంజి కేంద్రాలు కొనసాగాయన్నారు. తెచ్చుకున్న తెలంగాణలో కేసీఆర్ పరిపాలనలో పేదలు, రైతులు, యువకులు సమస్త ప్రజానీకం ఆనందంగా ఉన్నారన్నారు. ఒక్క చాన్సు ఇవ్వమనడానికి కాంగ్రెస్ ఏమైనా కొత్త పార్టీనా చెత్త పార్టీనా అన్నారు. అన్ని పథకాలు అమలు కావాలంటే రాష్ట్రంలో కేసీఆర్ రావాలని ములుగులో నాగజ్యోతి గెలవాలని ములుగు ప్రజలంతా నాగజ్యోతిని ఆదరించాలని కోరారు. గతంలో ఓటు వేయకున్నా, ములుగును జిల్లా చేశాం కానీ, ఈసారి మాత్రం నాగజ్యోతిని గెలిపిస్తేనే అడిగినవన్నీ చేసి పెడుతామని కేటీఆర్ నవ్వుతూ అన్నారు. పనులన్నీ కావాలంటే కత్తి ఒకరికి ఇచ్చి యుద్ధం ఒకరిని చేయమంటే మంచిది కాదన్నారు. కత్తి నాగజ్యోతికి ఇవ్వాలి..యుద్ధం నాగజ్యోతి చేస్తుందని ప్రజలు అడిగిన ప్రతి పని చేసే బాధ్యత తమదేనని కేటీఆర్ స్పష్టం చేశారు. రోడ్డు షోలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, రోడ్లు భవనాల కార్పొరేషన్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నర్సింహారావు, పార్టీ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, జడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ, ఎంపీపీ అంతటి విజయ, నాయకులు ప్రదీప్‌రావు, వలిబాబా, తుమ్మ మల్లారెడ్డి, కర్ర రవీందర్, రాంనర్సయ్య, ఖాజాపాషా, కూనూరు మహేశ్ పాల్గొన్నారు.


### కొంగు చాచి ఓట్లు అడుగుతున్నా.. అవకాశం ఇవ్వండి

**– బీఆర్ఎస్ ములుగు అభ్యర్థి బడే నాగజ్యోతి**

అందరి ఆడబిడ్డగా మీ ముందుకు వచ్చానని, కొంగు చాచి ఓట్లు అడుతున్నానని ఒక్కసారి అవకాశం కల్పిస్తే ములుగు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. మన ప్రాంతం అభివృద్ధి జరిగిందంటే కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనేనన్నారు. ఏనాడుకూడా ములుగు ప్రాంత అభివృద్ధి కోసం పట్టించుకోని కాంగ్రెస్ నాయకులు ఓటు వేయాలని అడుతున్నారని, వారి మాటలు నమ్మకుండా కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రతి పక్ష పార్టీ ఎమ్మెల్యేలు అన్న కేటీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గం వలే అభివృద్ధి చేస్తామని అంటున్నారని 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో వారు అభివృద్ధి చేసిన నమూనా నియోజకవర్గం ఒక్కటి కూడా లేదన్నారు. ములుగు సమస్యలు అన్న కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లానని అవన్నీ కూడా పరిష్కారం అవుతాయన్నారు. ప్రభాకరన్న బిడ్డగా సాదుకున్నా చంపుకున్నా మీరేనని ఉద్వేగంతో మాట్లాడారు. మీకోసం సచ్చేదాకా కొట్లాడే సత్తా నాకుందని, ఊపిరి ఉన్నంత వరకు ప్రజా సేవకే అంకితం అవుతానని తెలిపపారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలు తెచ్చుకునుడే..

- కేసీఆర్ పాలనలో ఇంటింటికీ సంక్షేమం
- చేసిన అభివృద్ధిని చూసి ఓటెయ్యండి
- మంత్రి సత్యవతి రాథోడ్
- సంక్షేమ పథకాలపై తండాల్లో చర్చ జరగాలి
- బీఆర్ఎస్ మహబూబాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్



బీఆర్ఎస్ మహబూబాబాద్ అభ్యర్థి శంకర్‌నాయక్ ప్రచారంలో పాల్గొన్న తండా వాసులు

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 27 : కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే కష్టాలను కొనితెచ్చుకున్నట్లేనని గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. సోమవారం ఆమె మహబూబాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్‌తో కలిసి మండలంలోని మల్యాల, రేగడి తండా, చోక్లాతండా, దామ్యతండా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయా తండాల ప్రజలు మంత్రి సత్యవతి, ఎమ్మెల్యేకు పూలతో స్వాగతం పలికారు. మంత్రి, ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికలు రాంగనే ఆగమాగం కావొద్దని, ఎవరు అభివృద్ధి చేశారో గుర్తించి ఓటు వేయాలన్నారు.గతంలో 50ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ తండాలను పట్టించుకోలేదన్నారు. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి, వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేశారని అన్నారు. సీఎం కేసీఆర్ ఎంతో కష్టపడి 24 గంటల కరెంట్‌ను తీసుకొస్తే కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి 3 గంటల కరెంటు చాలని అహంకారంగా మాట్లాడాడని, అతడికి రైతులు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే మళ్లీ కరెంట్ కష్టాలతో రైతులు ఇబ్బంది పడుతారని అన్నారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో పేదల కోసం అనేక పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నాడని అన్నారు. కళ్యాణలక్ష్మి, ఆసరా పింఛన్, దళితబంధు వంటి పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. ఎన్నికలు రాగానే అనేక పార్టీల నాయకులు తండాలకు వచ్చి ఇష్టమొచ్చిన హామీలు ఇస్తారని, వాళ్ల మాయమాటలకు మోసపోవొద్దన్నారు. గత పాలకుల హయాంలో తండాల్లో రోడ్లు అస్తవ్యస్తంగా ఉండేవని, సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాతనే వాటి రూపురేఖలు మారాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ సీఎం అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ప్రియాంక, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు మహబూబ్ పాషా, నాయిని రంజిత్, తేళ్ల శ్రీను, అశోక్‌నాయక్, ఆవుల వెంకన్న, దాము, వీరన్న, నర్సింగ్ వెంకన్న, షరీఫ్, రామచంద్రు, బాలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.